క్లుప్తంగా

30న రన్ ఫర్ జీసస్

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రైస్తవుల పవిత్రమైన గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని ఈ నెల 30న రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ కార్యక్రమం ఏపీ స్టేట్ కో ఆర్డినేటర్ రెవరెండ్ బెల్లంకొండ శివాజీరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా 370 కేంద్రాల్లో జరిగే కార్యక్రమంలో బిషప్‌లు, ప్రీస్టులు, పాస్టర్స్ పాల్గొంటారన్నారు.

ఆలయానికి ఊయల బహూకరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి బుధవారం ఆలయ డోలు విద్వాంసుడు గుంటుపల్లి సత్యనారాయణ సుమారు రూ.20వేల విలువ కలిగిన టేకు ఊయలను ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశ రుద్రాభిషేక, శ్రీ చక్రనవార్చన



విజయవాడకల్చరల్: భారతీ తీర్థ మహాస్వామి 74వ జన్మదినం సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వైదిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం 8 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాన్యాసం, శ్రీ చక్రనవార్చన, సాయంత్రం ఆది దంపతులకు త్రిశతి, మహామంగళ హారతి, వేదాశీర్వచనం నిర్వహించారు. వేద పండితులు చతుర్వేద పారాయణం పఠించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విదుశేఖర భారతి మహాస్వామి ఆదేశంతో 73 రోజుల పాటు 15 మంది రుత్వికులచే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 18 వ తేదీ పూర్ణాహుతితో కార్యక్రమాలు పూర్తవుతాయని తెలిపారు.

ఆర్యవైశ్య అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గడ్డం సత్యనారాయణను నియమిస్తూ ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ ప్రకటించారు. ఈ మేరకు మహాసభ నియామక పత్రాన్ని సత్యనారాయణకు అందజేసింది. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ చిన్న తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం నిర్వహించే అమ్మవారి పుట్టింటి పసుపు–కుంకుమ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని నందిగామ ఏసీపీ డా.రవికిరణ్ కోరారు. పసుపుకుంకుమ బండ్ల రాకపోకలకు సంబంధించి ఆలయ పరిసరాల్లో చేసిన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఆలయ అధికారులకు పలుసూచనలు చేశారు. మునేరులో భక్తులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీజే సౌండ్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, ఎస్‌ఐ పి.రాంబాబు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఆసిఫ్ తదితరులు



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న ముస్లిం మైనార్టీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీఎం జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం చేపట్టిన బస్సు యాత్ర విజయవంతం కావాలని కోరుతూ పంజా సెంటర్‌లోని దర్గాలో ఆసిఫ్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాలోని బాబావారికి చాదర్‌ను సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన కూటమితో మరోసారి ప్రజలను మోసం చేయటానికి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మీకు మేలు జరిగితేనే నాకు ఓటు వేయండని అడుగుతున్న ధైర్యం ఉన్న ఏకైక వ్యక్తి జగనన్న మాత్రమేనన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగినట్లు ప్రజలను ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాల ద్వారా జగనన్న మేలు చేశారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను తన గుండెల్లో పెట్టుకొని రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తున్న జగన్ మోహన్‌రెడ్డి కావాలో, అడుగడుగునా ప్రజలను మోసం చేసిన చంద్రబాబు కావాలో ప్రజలకు తెలుసన్నారు. చంద్రబాబు కూటమిని తరిమితరిమి కొట్టేందుకు యావత్ రాష్ట్ర ప్రజలు ఎదురు చేస్తున్నారని వివరించారు. ఇప్పటి వరకూ టీడీపీ కూటమికి అభ్యర్థులు దొరకలేదన్నారు. అందుకే ఎక్కడో ఉండి బ్యాంకులను మోసగించిన మాయగాళ్లను తీసుకొచ్చి సీట్లు కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, జనసేనలకు కూడా చంద్రబాబే అభ్యర్థులను ఎంపిక చేయటం ఆ పార్టీ నేతలు ఎంతగా దిగజారిపోయారో అర్థమవుతుందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి బస్సుయాత్ర అనగానే చంద్రబాబుకు ఇతర ప్రతిపక్షాలకు వణుకు పుడుతుందన్నారు. పార్టీ నాయకులు షేక్ బాజీ షాహిద్, . షేక్ అప్సర్, బాబు భాయ్, పైడాడ శ్రీనివాసరావు, నయీమ్, సింగ్ తదితర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు వెన్నుదన్ను జగనన్న

భవానీపురం(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వం ముస్లిం మైనార్టీల పట్ల వివక్ష చూపితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచిందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఏటీఏ) సభ్యులు, పలువురు వ్యాపారవేత్తలు బుధవారం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ కార్యాలయానికి వచ్చి ఆసిఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. మీ వెంటే ఉంటూ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే ముస్లిం మైనార్టీలు అన్ని విధాల అభివృద్ధి చెందారని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఆసిఫ్‌ను కలిసినవారిలో ఏటీఏ జనరల్ సెక్రటరీ బాబా, మునీర్ ఫౌండేషన్ చైర్మన్ మునీర్, తబ్లిక్ జమాత్ అమీర్, న్యాయవాదులు మతీన్, ఖలీల్, ఇఎన్‌టీ వైద్యులు డాక్టర్ రెహమాన్, కటన్ కరిముల్లా, మొయిద్దీన్ రాజు, షఫీ, కరిముల్లా ఉన్నారు.



41వ డివిజన్‌లో కార్పొరేటర్ ఇర్ఫాన్‌తో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

భారీ మెజార్టీతో గెలిపించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ పిలుపునిచ్చారు. డివిజన్‌లో షేక్ ఆసిఫ్ తరఫున ఆయన కుమార్తె రేష్మ, కుమారుడు జావెద్ స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్‌తో కలిసి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. పశ్చిమంలో ఆసిఫ్‌ను, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీని గెలిపిస్తే భవిష్యత్‌లో పథకాలు కొనసాగుతాయన్నారు. రాష్ట్ర భవిష్యత్ చక్కగా ఉంటుందంటూ ఓటర్లకు వివరించారు. తమ తండ్రి ఆసిఫ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని రేష్మ, జావెద్ కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌లు పరిశీలన



సీఆర్పీఎఫ్ బృందానికి సూచనలిస్తున్న టీకె రాణా, స్వప్నిల్ దినకర్ ఫుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ):పోలీస్ కమిషనర్ టీకె రాణా, నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ రిటర్నింగ్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం విజయవాడ పరిధిలో ఉన్న చెక్‌పోస్టులను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలోఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించకుండా వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, వాటిల్లో కావాల్సిన వసతులను తనిఖీ చేశారు. ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాన్ని కలిసి ప్రజలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీలోగల సీఆర్పీఎఫ్ బృందానికి ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు ఉండే సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా రామవరప్పాడు రింగ్, ముస్తాబాదు, పవర్‌గ్రిడ్, పాముల కాలువ ప్రదేశాల్లోని చెక్‌పోస్టులను పరిశీలించారు. అనంతరం సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఎన్నికల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

ఆసిఫ్‌కు ట్రేడ్ యూనియన్ కార్మికుల మద్దతు

ఎన్నికల యుద్ధానికి సిద్ధం అంటూ నినాదాలు



యుద్ధానికి సిద్ధం అంటూ నినదిస్తున్న ఆసిఫ్, ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ కార్మికులు మద్దతు పలికారు. విద్యాధరపురంలోని పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయానికి బుధవారం సాయంత్రం పెద్ద సంఖ్యలో విచ్చేసిన ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులను ఆసిఫ్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ కార్మికుల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి సంక్షేమం కోసం 'వాహన మిత్ర' పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. తద్వారా ఇప్పటి వరకు 2,75,931 మంది అన్ని వర్గాల ఆటో, ట్యాక్సీ, క్యాబ్, ఎమ్‌డీఎమ్ డ్రైవర్/ఓనర్లు రూ.1302 కోట్లు లబ్ధి పొందారని గుర్తు చేశారు. అదే విధంగా అర్హులైన కార్మికుల కుటుంబ సభ్యులకు అమ్మ ఒడి, ఆసరా, చేయూత, పింఛన్ వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా అద్దె ఇళ్లల్లో నివసిస్తూ అవస్థలు పడుతున్న కార్మిక కుటుంబాల మహిళల పేరుతో ఇళ్ల స్థలాలు కేటాయించి వారి సొంత ఇంటి కలను సాకారం చేసిన సీఎం జగనన్నకు రుణపడి ఉండాలని తెలిపారు. మీ కుటుంబానికి మంచి జరిగిందనుకుంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటెయ్యాలని సీఎం జగనన్న ఘంటా పథంగా చెబుతున్నారని పేర్కొన్నారు. మనకు మంచి చేసిన సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.

పశ్చిమంలో ఆసిఫ్‌ను గెలిపించుకుంటాం...

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జోనల్ ఇన్‌చార్జ్ నంబూరు ప్రదీప్, నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో షేక్ ఆసిఫ్‌ను గెలిపించుకుని హ్యాట్రిక్ సాధిస్తామని తెలిపారు. సుజనా చౌదరి లేదా లోకేష్ పోటీ చేసినా అందరికీ అందుబాటులో ఉండే ఆసిఫ్ మాత్రమే ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని చెప్పారు. ఎన్నికల యుద్ధానికి తామంతా సిద్ధం అంటూ పోస్టర్‌ను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గుబ్బా చంద్రశేఖర్, ట్రేడ్ యూనియన్ నగర నాయకులు గోమతోటి వినోద్ పాల్, కె సురేష్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దీన్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, మండల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదులను తరిమికొట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో మతోన్మాద శక్తులను తరిమికొట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 37వ డివిజన్‌లోని తారాపేట మసీదు ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆసిఫ్ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా మసీదు బయట తనను కలిసి మీడియాతో ఆసిఫ్ మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసం భగవంతుని ఆశీస్సులు పొందటానికి మానవుడు ఏ విధంగా నడుచుకోవాలో వివరిస్తుందన్నారు. జగనన్న నాయకత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ముస్లిం వర్గాలకు మేలు జరిగిందన్నారు. చంద్రబాబు తన పాలనలో కనీసం ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేకపోవటం మైనార్టీ వర్గాల పట్ల ఆయనకు చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. కొంతమంది మతోన్మాద శక్తులు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఇక్కడి మతసామరస్యాన్ని భగ్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని వివరించారు. దానిని అందరూ సమిష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్. షేక్ గౌస్‌మోహిద్దీన్, నాయకులు బషీరుద్దీన్, బాజీ బాబా, జిలాని, సుభాని, జీఎంసి అల్తాఫ్, హుస్సేన్, సుభాని ఖాన్, జావిద్ హుస్సేన్, షరీఫ్, ఇక్బాల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

చిట్టినగర్ వీధుల్లో పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న పోలీసులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా భరోసా కల్పిస్తున్నామని కొత్తపేట సీఐ టి.గణేష్ తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు కవాతు నిర్వహించారు. చిట్టినగర్ సెంటర్ నుంచి ప్రారంభమైన కవాతు కేఎల్‌రావునగర్, రాజీవ్‌శర్మనగర్, టీనర్‌పేట అడ్డరోడ్డు మీదగా సాగింది. ఈ సందర్భంగా సీఐ గణేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా కవాతు నిర్వహించామని తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాముల కాల్వ వద్ద త్వరలో చెక్‌పోస్టును ఏర్పాటు చేసి తనిఖీలను కట్టుదిట్టం చేస్తామన్నారు. ప్రజలు రూ. 50 వేల కన్నా ఎక్కువ తీసుకువెళ్లితే అందుకు తగిన ఆధారాలను తప్పక చూపాలని సూచించారు. వన్‌టౌన్ సీఐ దుర్గ శేఖర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, వన్‌టౌన్, కొత్తపేట ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చాముండి గోల్డ్, డైమండ్ షోరూమ్ ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వస్త్ర వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలిచిన చిల్లపల్లి నాగేశ్వరరావు అండ్ సన్స్ ఆధ్వర్యంలో పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ఏర్పాటు చేసిన చాముండి గోల్డ్, డైమండ్ షోరూమ్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. నాణ్యమైన బంగారు, వజ్రాభరణాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ, నమ్మకం పొందుతున్న తాము, ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని నూతన షోరూమ్ ఏర్పాటు చేసినట్లు షోరూమ్ అధినేత చిల్లపల్లి శ్రీకర్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహాది, ఇతర శుభకార్యాలకు వినియోగదారులు కోరుకునే సరికొత్త మోడల్స్‌లో సంప్రదాయాలు ప్రతిబింబించేలా బంగారు, వజ్రాభరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. డైమండ్‌లో విక్టోరియన్, పోల్కి డైమండ్స్ కలెక్షన్స్ , బంగారంలో యాంటిక్ జ్యూయలరీ, టెంపుల్ జ్యూయలరీ, అమృత్‌సర్‌కలెక్షన్స్‌తో పాటు వివిధ ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ



ఫ్యాన్లు అందిస్తున్న వెంకట్రావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):విజయవాడ రూరల్ గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌కు స్థానిక ఏబీసీడీ ఫౌండేషన్ సీలింగ్ ఫ్యాన్లను బహూకరించింది. డ్వామా ఏపీడీ రావూరి లలిత పుట్టిన రోజును పురస్కరించుకుని ఫౌండేషన్ వ్యవస్థాపకులు, న్యాయవాది ఆవుల వెంకట్రావు బుధవారం ఈ ఫ్యాన్లను హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణకు అందచేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వేసవి కాలం ఉష్ణోగ్రతల కారణంగా పాఠశాల తరగతి గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఫ్యాన్లు అందించామని చెప్పారు. వేడుకల పేరుతో డబ్బు వృథా చేయకుండా పేద విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించిన డ్వామా ఏపీడీ లలిత కుమారి అభినందనీయురాలని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి విధానంతో ఎంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ కృష్ణంరాజు

మక్కపేట(వత్సవాయి) :రైతులు పంటమార్పిడి విధానాన్ని రైతులు ఖచ్చితంగా అమలు చేయాలని కృషివిజ్ఞాన కేంద్రంప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.కృష్ణంరాజు సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన భాగస్వామ్య గ్రామీణ అంచనా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు మూడు నెలలపాటు గ్రామంలో ఉండి రైతులు పంటలు సాగుచేసే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. రైతులు మూస పద్ధతిలో వ్యవసాయం చేయకుండా ఏటా పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. విచ్చలవిడి రసాయనిక ఎరువుల వినియోగంతో భూమిలో సారం తగ్గిపోయిందన్నారు. ప్రతి ఏడాది తప్పకుండా పశువుల ఎరువుతోపాటు మేకల, గొర్రెల మందలను పొలాల్లో నిలుపుకోవాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సుమారు 40రోజుల ముందు పొలంలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుని తర్వాత కలియదున్నుకుంటే భూమిలో సారం పెరుగుతుందని వివరించారు. శాస్త్రవేత్త ఐ.వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షులు కొండబోలు వెంకటబ్రహ్మం, వ్యవసాయ కళాశాల విద్యార్థులు జి.శ్రీను, ఆర్.రాజేంద్ర, ఎస్.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతను విస్మరించవద్దు

దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు



మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక బాధ్యతలతో ముందుకు సాగినప్పుడే తాము చదివిన విద్యకు సార్థకత లభిస్తుందని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాలలో స్పోర్ట్స్ డే వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కేఎస్ రామారావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. సామాజిక చైతన్యంతో పాటుగా బాధ్యతయుతంగా ముందుకు సాగాలన్నారు. మారుతున్న పరిస్థితులను గమనిస్తూ తమను తాము తీర్చిదిద్దుకోవాలని కోరారు. కేబీఎస్ కళాశాల 59 సంవత్సరాల ప్రస్థానం విజయవంతంగా కొనసాగించటం ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పారు. గుంటూరు టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం మాట్లాడుతూ సుమారు ఆరు దశాబ్దాలుగా కేబీఎస్ కళాశాల విద్యారంగానికి చక్కని సేవలందిస్తుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా కోర్సులను మార్చుకుంటూ అద్భుతమైన అభివృద్ధిని అందిపుచ్చుకుంటుందని వివరించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు టి.శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ఆవిష్కరణలను గమనంలో ఉంచుకొని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గడిచిన విద్యా సంవత్సరంలో వివిధ రంగాల్లో సాధించిన విజయాలను వివరించారు. కళాశాల సహాయ కార్యదర్శి జీవీ రామారావు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక అంశాలు అలరించాయి. శాస్త్రీ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

● హమ్మయ్య... ఓ పనై పోయింది!



విజయవాడ పటమట లోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు పూర్తవటంతో పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్ల మూడోరోజు బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మునేరులో పెద్ద ఎత్తున గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. భక్తులు రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలో బుర్రకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూస్తూ కాలక్షేపం చేశారు. ఎగ్జిబిషన్ వద్ద భక్తులు కోలాహలం కనిపించింది. భక్తులకు ఇబ్బంది లేకుండా గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు నిర్వహిస్తున్నారు.



వివాహిత అదృశ్యంపై కేసు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):వివాహిత అదృశ్యంపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వజ్జా రమేష్ కుటుంబ సభ్యులతో కలసి పూర్ణానందంపేట, జోసఫ్ స్ట్రీట్‌లో నివాసముంటున్నారు. భార్యాభర్తలు వేర్వేరు ప్రైవేటు సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో భార్య తనతో పాటు పనిచేసే తోటి ఉద్యోగికి ఆమె పేరుమీద లోన్‌లు ఇప్పించింది. ఈ విషయం తెలియడంతో భర్త ఎందుకు ఇప్పించావంటు అడిగాడు. దీంతో ఆమె భర్తకు తెలియకుండా ఇంట్లోని బంగారు ఆబరణాలను తోటి ఉద్యోగికి ఇచ్చి లోన్లు క్లియర్ చేయించింది. ఈ విషయం కూడా తెలియడంతో బంగారం ఎందుకు ఇచ్చావంటు భర్త మందలించాడు. ఆనంతరం మంగళవారం ఉదయం 9 గంటలకు భర్త ఆఫీస్‌కు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో భార్య ఫోన్ చేసి తాను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని చెప్పి స్విచ్ఛాఫ్ చేసింది. వెంటనే అతను ఇంటికి వెళ్లి చూడగా భార్య కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తన భార్య కనిపించడం లేదంటు ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.